సాక్షి
విశాఖపట్నం
గురువారం । 11 । జూలై । 2024



వరహావతారంలో జగన్నాథుడు

టర్నర్ చౌల్ట్రీలో జగన్నాథస్వామి బుధవారం వరహావతారంలో దర్శనమిచ్చారు. 8లో



డ్రాప్ ఆట..!

సాంకేతిక సమస్యతో ప్రభుత్వ స్కూళ్లలో కూడా యు–డైస్ ప్లస్‌లో విద్యార్థుల పేర్లు నమోదు సవ్యంగా సాగటం లేదు. 8లో



కేంద్ర మంత్రులకు స్వాగతం

కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి, సహాయ మంత్రి శ్రీనివాసవర్మకు విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. 8లో

జన విశాఖి

విశాఖ 23,85,658 | అనకాపల్లి 17,26,998 | అల్లూరి 9,53,960



ఏయూలో ఏర్పాటు చేసిన డిజిటల్ జనాభా గడియారం

- రాష్ట్రంలోనే అత్యధిక జనసాంద్రత ఉన్న జిల్లా మనదే..
- చదరపు కి.మీకి 1,670 మంది నివాసం
- నేడు ప్రపంచ జనాభా దినోత్సవం

సాక్షి, విశాఖపట్నం: మహా నగరం.. జనసంద్రమవుతోంది. ఓ వైపు అలలతో అలరారుతున్న సాగరం.. మరోవైపు జనంతో కిటకిటలాడుతోంది నగరం. రాష్ట్రంలో అత్యధిక జనసాంద్రత కలిగిన జిల్లాగా విశాఖపట్నం నిలిచింది. అత్యధిక జనాభా ఉన్న జిల్లాల జాబితాలో రెండో స్థానంలో ఉంది.

ప్రపంచ నగరాలు, దేశంలోని మెట్రో సిటీలతో పోటీ పడుతున్న విశాఖ నగరం.. అపారమైన అవకాశాలతో అందరికీ ఆహ్వానం పలుకుతోంది. పారిశ్రామికీకరణ, విద్యా సంస్థలు, పర్యాటకం, మౌలిక సదుపాయాలు, జీవన నాణ్యత తదితర అంశాలు ఇక్కడ స్థిరపడేందుకు ఆకర్షిస్తున్నాయి. అందుకే దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలు విశాఖపట్నాన్ని తమ డెస్టినేషన్‌గా మార్చుకుంటున్నారు. అందుకే ఈ జిల్లా రాష్ట్రంలోనే అత్యధిక జనసాంద్రత కలిగిన జిల్లాగా మారింది. జిల్లాలో చదరపు కి.మీకి 1,670 మంది నివసిస్తుండటం గమనార్హం.

రాష్ట్రంలో రెండో జిల్లాగా...

జనాభా పరంగా రాష్ట్రంలో రెండో జిల్లాగా విశాఖపట్నం నిలిచింది. జూలై 7 నాటికి 24,69,712 జనాభాతో పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ప్రథమ స్థానంలో ఉండగా.. 23,85,658 మందితో విశాఖపట్నం జిల్లా రెండో స్థానంలో నిలిచింది. గతేడాదితో పోలిస్తే 2.32 శాతం జనాభా విశాఖ జిల్లాలో పెరిగింది. విస్తీర్ణ పరంగా అత్యంత చిన్న జిల్లాగా 1048 చ.కిమీతో ఉన్న విశాఖపట్నం.. జనాభా, జనసాంద్రత విషయంలో మాత్రం అందనంత ఎత్తులో ఉండటం విశేషం. అనకాపల్లి జిల్లాలో 17,26,998 మంది జనాభా ఉండగా.. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 9,53,960 మంది నివసిస్తున్నారని ఏయూ జన గణన విభాగం వెల్లడించింది. జనసాంద్రత విషయంలో అల్లూరి సీతారామరాజు జిల్లా 77 మందితో అట్టడుగున నిలిచింది.

నాలుగో పరిశోధన కేంద్రం

భారత ప్రభుత్వం కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 18 జనాభా పరిశోధన కేంద్రాలు స్థాపించింది. వీటిలో 1956 ఢిల్లీలో స్థాపించిన జనాభా పరిశోధన కేంద్రం మొట్టమొదటి కాగా 1989 సాగర్(మధ్యప్రదేశ్) లో స్థాపించింది ఆఖరిది. ఈ క్రమంలో 1977లో ఆంధ్రా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన జనాభా పరిశోధన కేంద్రం నాల్గోది. ఈ కేంద్రాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రారంభించిన అనేక ఆరోగ్య కార్యక్రమాలు ఏ విధంగా అమలవుతున్నాయో పరిశీలించడం, పనితీరుకు సంబంధించి పరిశోధన చేయడం, తద్వారా వివిధ ఆరోగ్య పథకాలు, కార్యక్రమాల్లో ఎటువంటి మార్పుల అవసరం గుర్తించి ప్రభుత్వాలకు నివేదిక అందజేస్తాయి. జనాభా పెరుగుదలపై ప్రజలకు అవగాహన కల్పించి, చైతన్య పరచడంలో దోహదపడే విధంగా ఈ కేంద్రాల వద్ద డిజిటల్ జనాభా గడియారాలను ఏర్పాటు చేశారు. డిజిటల్ క్లాక్‌పై దేశ, రాష్ట్ర జనాభా వివరాలు ప్రత్యక్ష ప్రసారమవుతాయి.

న్యూస్‌రీల్

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, సీపీ

పెదగంట్యాడ: మండలంలోని మదీనాబాగ్ సమీపంలో ఉన్న ఏపీ మెడ్‌టెక్ జోన్‌లో వైద్య పరికరాలను తయారు చేసే రెండు సంస్థలకు సంబంధించి నూతన భవనాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం ప్రారంభించనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ బుధవారం పరిశీలించారు. సీఎం హెలీప్యాడ్ ప్రాంతం, సభా ప్రాంగణాన్ని పరిశీలించి సూచనలు చేశారు. ఇందులో భాగంగా పోలీసు బందోబస్తు ఏర్పాట్లపై ఆరా తీశారు.

కేజీహెచ్‌కు గంగవరం పోర్టు విరాళం



కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న పోర్టు ప్రతినిధి

పెదగంట్యాడ : అదానీ గంగవరం పోర్టు తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్సార్)లో భాగంగా కేజీహెచ్‌లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రూ.90 లక్షలు మంజూరు చేసింది. ఈ మేరకు కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు అదానీ గంగవరం పోర్టు యాజమాన్య ప్రతినిధి బుధవారం చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా పోర్టు యాజమాన్య ప్రతినిధి మాట్లాడుతూ అదానీ గంగవరం పోర్టు లిమిటెడ్, అదానీ ఫౌండేషన్‌తో కలసి విశాఖ నగరంలో అనేక కమ్యూనిటీ మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ఆరోగ్యం, విద్య రంగాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తోందని చెప్పారు. కేజీహెచ్‌లోని పీడియాట్రిక్ హెల్త్ కేర్‌లో సౌకర్యాలు కల్పించేందుకు గానూ, పిల్లల వార్డులో పడకలను రెట్టింపు చేసేందుకు రూ.90 లక్షలు అందజేశామని వివరించారు.

జాతీయ న్యాయ వర్సిటీల్లో విద్య విభిన్నం

డీఎస్ఎన్ఎల్‌యూ పూర్వ వీసీ కేశవరావు



సబ్బవరం: జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాల్లో అందించే విద్య ఎంతో భిన్నమైనదని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి, నల్సార్ విశ్వవిద్యాలయం ఆచార్యుడు డాక్టర్ వి.కేశవరావు అన్నారు. సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో నూతనంగా ప్రవేశం పొందిన మొదటి సంవత్సరం విద్యార్థులకు బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. దేశంలో అనేక న్యాయ విద్యాలయాలు, కళాశాలలు, ప్రైవేట్ విద్యా సంస్థలు న్యాయ విద్యను అందిస్తున్నాయన్నారు. వీటన్నింటిలో జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాలు అందిస్తున్న విద్య ఎంతో భిన్నంగా ఉంటుందన్నారు. మూట్ కోర్టుల్లో పాల్గొనడం, ప్రాజెక్ట్స్ నిర్వహించడం, డిబేట్‌లు, వివిధ రకాల అభ్యాసనాల ద్వారా న్యాయ విద్యను పొందుతారన్నారు. విద్యార్థులు వీటిలో పాల్గొనడం ద్వారా ఎంతో పరిణతి సాధిస్తారని వివరించారు. న్యాయవాది, కార్పొరేట్, జ్యుడీషియల్ రంగాల్లో వేటిలో స్థిరపడాలనుకుంటున్నారో.. విద్యార్థులు ముందుగానే లక్ష్యంగా నిర్దేశించుకోవాలని సూచించారు. ఆ దిశగా ఈ ఐదేళ్లు తమ అధ్యయనం కొనసాగించాలని, అప్పుడే లక్ష్యాన్ని చేరుకోగలన్నారు. వర్సిటీ ఉపకులపతి ఆచార్య సూర్యప్రకాశరావు మాట్లాడుతూ భారత స్వాతంత్రోద్యమంతో పాటు భారత రాజ్యాంగ రచనలో న్యాయవాదుల పాత్ర కీలకమైనదన్నారు. అనేక ఉద్యమాలు, సంస్కరణలతో సమాజానికి ఉపయోగపడేలా న్యాయవాదులు తయారుకావాలని పిలుపునిచ్చారు. అకడమిక్ డీన్ సోమా భట్టాచార్య, ఎగ్జామినేషన్ డీన్ డాక్టర్ కె.సుధ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు ఏపీఈఏ ఎన్నికలు

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఎంప్లాయీస్ అసోసియేషన్(ఏపీఈఏ) విశాఖ సిటీ యూనిట్ ఎన్నికలు గురువారం జరగనున్నాయి. పిఠాపురం కాలనీలోని అసోసియేషన్ కార్యాలయంలో గురువారం ఉదయం 9 గంటలకు నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుందని ఎన్నికల అధికారి, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వి.రాజేశ్వరి, అసిస్టెంట్ ఎన్నికల అధికారి వి.ధనరాజు తెలిపారు. అనంతరం ఎన్నికలు నిర్వహించి, కార్యవర్గాన్ని ఎన్నుకుంటారు.

రైతుబజార్లలో బియ్యం, కందిపప్పు

నేటి నుంచి విక్రయాలు

మహారాణిపేట: జిల్లాలోని 13 రైతుబజార్లలో గురువారం నుంచి ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు బియ్యం, కందిపప్పు విక్రయిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం ఎంవీపీకాలనీ, పెదవాల్తేరు, కంచరపాలెం, అక్కయ్యపాలెం/నరసింహనగర్, మర్రిపాలెం, గోపాలపట్నం, పెందుర్తి, సీతమ్మధార, ములగాడ, గాజువాక, స్టీల్‌ప్లాంట్, పెదగంట్యాడ, మధురవాడ రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సివిల్ సప్లయిస్, రెవెన్యూ, మార్కెటింగ్ శాఖ అధికారుల పర్యవేక్షణలో.. ధరలు అదుపులోకి వచ్చే వరకు విక్రయాలు జరుగుతాయని జేసీ వెల్లడించారు. డీమార్ట్, రిలయన్స్, మోర్, స్పెన్సర్స్, ఇతర షాపింగ్ మాల్స్‌లో కూడా ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే బియ్యం, కందిపప్పు విక్రయించాలని స్పష్టం చేశారు.

స్టీమ్డ్ రైస్(సోనా మసూరి/బీపీటీ రకం): **కిలో రూ.49**
రారైస్(సోనా మసూరి/బీపీటీ రకం): **కిలో రూ.48**
కందిపప్పు(దేశవాళీ రకం): **కిలో రూ.160**

మాతృభాష పరిరక్షణ అందరి బాధ్యత



విజయ నిఘంటుచంద్రిక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- విజయ నిఘంటు చంద్రిక ఆవిష్కరణ

మద్దిలపాలెం : మాతృభాష పరిరక్షణ కోల్పోతే సర్వం కోల్పోతామని.. దీన్ని పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. గోకుల్ చంద్ర రాహుల్ చంద్ర మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్, సహృదయ సాహితి సంయుక్తంగా బుధవారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో 'విజయ నిఘంటు చంద్రిక' గ్రంథం ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృభాషలోనే ప్రభుత్వ ఉత్తర్వులు ఉండాలన్నారు. న్యాయవాదుల వాదోపవాదాలు సైతం తెలుగుభాషలో కొనసాగించాలన్నారు. 40 వేల పదాలను తెలుగులో సేకరించి అందించడం తెలుగుభాషకు వరమైందన్నారు. అందుకు పూనుకుని సహకరించిన సూరపనేని విజయకుమార్ అభినందనీయులన్నారు. మాటలో మాధుర్యం మాతృభాషలోనే ఉంటుందన్నారు. 5వ తరగతి వరకూ మాతృభాషలో విద్యాబోధన ఉండాలన్నారు. భాష శ్వాస వంటిదని, భాష ప్రాధాన్యత కనుమరుగైతే సంస్కృతి సమాజం కూలిపోతుందన్నారు. నిఘంటువు రూపకర్త రాణి సదాశివమూర్తి, కె.సుజన నిఘంటువులోని విశేషాలు వివరించారు. సహృదయ సాహితీ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్, విజయనిర్మాణ్ ఎండీ వీరమాచనేని అజయ్‌కుమార్, బేతవోలు రామబ్రహ్మం, ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యం,శాస్త్రి, ఆచార్య కోలవెన్ను మలయవాసిని, డి.వి.సూర్యారావు పాల్గొన్నారు.

అక్షరంపై అక్కసు

- డెక్కన్ క్రానికల్ కార్యాలయంపై టీడీపీ నాయకుల దాడి
- పచ్చ నేతల దౌర్జన్యాన్ని ఖండించిన రాజకీయ పక్షాలు, సంఘాలు
- ఇది పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణన
- ఈ దుశ్చర్యకు నిరసనగా ఆందోళనకు సిద్ధమవుతున్న జర్నలిస్టు యూనియన్లు



బీచ్‌రోడ్డులోని డెక్కన్ క్రానికల్ కార్యాలయం ఎదుట బ్యానర్‌ను తగలబెడుతున్న తెలుగునాడు మహిళలు



కార్యాలయానికి చొచ్చుకెళ్లిన టీడీపీ శ్రేణులు

విశాఖ సిటీ : 'అవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా' అన్న సామెత తెలుగుదేశం ప్రభుత్వానికి సరిగ్గా సరిపోతుంది. చినబాబు రెడ్ బుక్ పేరుతో ఐఏఎస్, ఐపీఎస్‌లపై బెదిరింపులకు పాల్పడుతుంటే.. టీడీపీ పిల్ల బ్యాచ్ విచక్షణా రాహిత్యంతో భౌతిక దాడులకు తెగబడుతోంది. నిన్న మొన్నటి వరకు ప్రభుత్వ నిర్వాకాన్ని ప్రశ్నించిన మీడియా సంస్థలపై బ్యాన్ విధించాలని ప్రయత్నించి.. హైకోర్టు మొట్టికాయలతో చంద్రబాబు ప్రభుత్వం వెనక్కు తగ్గింది. తాజాగా స్టీల్‌ప్లాంట్‌పై ప్రభుత్వ తీరును ప్రశ్నిస్తూ కథనం ప్రచురించిన డెక్కన్ క్రానికల్ పత్రికా కార్యాలయంపై టీడీపీ నేతలు భౌతిక దాడికి తెగబడడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తిస్తోంది. బీచ్ రోడ్డులో ఉన్న జాతీయ పత్రికా కార్యాలయంలోకి టీడీపీ విద్యార్థి నేతలు దూసుకుపోయి రాళ్లతో దాడి చేయడం, డెక్కన్ క్రానికల్ బోర్డుకు నిప్పు పెట్టడం పెనుదుమారం రేపుతోంది. అక్షరాల గొంతు నులిమి.. పత్రికా స్వేచ్ఛను హరించి.. రాష్ట్రంలో రాక్షస పాలనకు చంద్రబాబు ప్రభుత్వం నాంది పలికింది. పచ్చనేతల ఈ దుశ్చర్యను పార్టీలకు అతీతంగా అన్ని రాజకీయ పక్షాలు, సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి.

మీడియాపై అణచివేతకు ప్రభుత్వ పన్నాగం

రాష్ట్రంలో మీడియాను తన చేతల్లో పెట్టుకోడానికి చంద్రబాబు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వామ పక్ష పార్టీలు, జర్నలిస్టు సంఘాలు మండిపడుతున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రజలకు మెరుగైన సేవలందించి వారి అభిమానం పొందాల్సిన నేతలు ప్రతీకారంతో, అధికార బలంతో మీడియాపై దాడులు చేస్తూ బలపడాలనుకోవడం సరికాదని హితవు పలుకుతున్నాయి. ప్రజల పక్షాన నిలుస్తున్న మీడియా, పత్రికలపై దాడులకు పూనుకోవడాన్ని ఖండిస్తున్నాయి. ప్రజల కోసం వినియోగించాల్సిన అధికారాన్ని మీడియా నోరు నొక్కేందుకు ఉపయోగించే వికృత సంస్కృతి సరికాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. వాదనలో నెగ్గలేని వారే భౌతిక దాడులకు దిగుతారనడానికి ఇదే ఉదాహరణగా పేర్కొంటున్నాయి. తమకు వ్యతిరేకంగా మాట్లాడినా, రాసినా అంతుచూస్తామంటూ ప్రజాస్వామ్య సంస్థలను బెదిరిస్తూ నియంతలా వ్యవహరించడం ప్రభుత్వానికే మంచిది కాదని సూచిస్తున్నాయి. పత్రికా కార్యాలయాలు, పాత్రికేయులపై దాడి చేయడమంటే ప్రజాస్వామ్యంపై దాడి చేయడమే అవుతుందని పునరుద్ఘాటిస్తున్నాయి. ఇదే పద్ధతి కొనసాగితే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరిస్తున్నాయి.

దాడిని ఖండిస్తున్నాం

డెక్కన్ క్రానికల్‌పై టీడీపీ విద్యార్థి, మహిళా విభాగాల కార్యకర్తలు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. స్టీల్‌ప్లాంట్‌కు సంబంధించి వంద శాతం స్ట్రాటజిక్ సేల్ విషయమై కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలత వ్యక్తం చేసినట్లు వివిధ పత్రికల్లో వచ్చింది. ఇదే వార్త డెక్కన్ క్రానికల్ ప్రచురించింది. ఇది వాస్తవం కాకపోతే టీడీపీ ఖండించాలి. కానీ పత్రిక కార్యాలయం మీద దాడి చేయడం పత్రికా స్వేచ్ఛను హరించడమే అవుతుంది. దాడి చేసిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి.

– ఎం.జగ్గునాయుడు, జిల్లా కార్యదర్శి, సీపీఎం

పత్రికా కార్యాలయంపై దాడి హేయం



ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర ఎంతో గొప్పది. అటువంటి పత్రికా కార్యాలయంపై టీడీపీ గుండాలు దాడి చేయడం హేయమైన చర్య. దీనిని ప్రతి ఒక్కరూ ఖండించాలి. భవిష్యత్‌లో ఎవ్వరూ ఇలా దాడులు చేయకుండా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– మార్టుపూడి పరదేశి,
రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్ సీపీ

పత్రికా స్వేచ్ఛపై దాడి సరికాదు



నిత్యం ప్రజలకు సమాచారాన్ని ఇచ్చే మీడియాపై దాడి చేయడం అన్యాయం. ఇది పత్రికా స్వేచ్ఛపై దాడి చేయడమే. పత్రిక రాసిన కథనాలపై అభ్యంతరాలుంటే వాటిపై కౌంటర్ ఇవ్వాలి. అంతేకానీ ఫోర్త్‌ఎస్టేట్ అయిన మీడియా కార్యాలయంపై దాడి చేయడం, కార్యాలయ బోర్డుకు నిప్పుపెట్టడం మంచి పద్ధతి కాదు.

– మంత్రి రాజశేఖర్,
ప్రధాన కార్యదర్శి, స్టీల్ ఐఎన్‌టీయూసీ

దాడి చేసిన వారిని శిక్షించాలి



పత్రికా కార్యాలయంపై దాడి చేయడం అంటే పత్రికా స్వేచ్ఛను హరించడమే. వాస్తవాలను వెలుగులోకి తీసుకు వచ్చి.. ప్రజలకు, ప్రభుత్వాలకు వారధిగా నిలిచేవి పత్రికలు. అటువంటి పత్రికా కార్యాలయంపై దాడి చేయడం దారుణం. నిందితులను కఠినంగా శిక్షించాలి.

– పిట్టా రెడ్డి, ప్రధాన కార్యదర్శి, స్టీల్ వైఎస్సార్‌టీయూసీ

విశాఖ చేరుకున్న కేంద్ర మంత్రులు


విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న కేంద్ర ఉక్కు సహాయ మంత్రి శ్రీనివాసవర్మ

గోపాలపట్నం: కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, ఆ శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ బుధవారం విశాఖ చేరుకున్నారు. విమానాశ్రయంలో వారికి బీజేపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గంలో ఆర్‌ఐఎన్‌ఎల్ గెస్ట్‌హౌస్‌కు వారు చేరుకున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీరాజు, బాలరాజేశ్వరరావు పాల్గొన్నారు.

వరహావతారంలో జగన్నాథుడు




దాబాగార్డెన్స్: టర్నర్ చౌల్ట్రీలో జగన్నాథస్వామి బుధవారం వరహావతారంలో దర్శనమిచ్చారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు స్వామికి మేలుకొలుపు, నాదస్వరం, 6 నుంచి 7 గంటల వరకు నిత్యపూజ, 7 నుంచి 9.30 గంటల వరకు జగన్నాథ స్వామి ప్రార్థన సంఘం వారిచే ప్రార్థన తరంగిణి, 9.30 నుంచి 10.30 వరకు సామూహిక లలితా సహస్రనామ పారాయణ, మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సామూహిక భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. సాయంత్రం వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ ఈవో టి.రాజగోపాల్ రెడ్డి, అర్చకులు పాణంగిపల్లి జగన్నాథాచార్యులు, పాణంగిపల్లి రంగనాథాచార్యులు, పాణంగిపల్లి కేశవాచార్యులు, యేడిద సురేష్‌బాబు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

‘ధర్మవరపు దివ్య పెందుర్తి మండలం వెంకటాపురం ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదివింది. ఈ ఏడాది తమ స్వగ్రామమైన శ్రీకాకుళం జిల్లా పలాస స్కూల్లో 6వ తరగతి చేరేందుకు వెళ్లింది. గత నెల 17న ఇక్కడి పాఠశాలలో టీసీ ఇచ్చేసినా, సదరు విద్యార్థిని పేరు డ్రాప్‌బాక్స్‌లో కనిపించకపోవటంతో పలాసలోని స్కూల్లో ఇప్పటి వరకు రికార్డుల్లో నమోదు చేయలేదు. దీంతో స్టూడెంట్ కిట్ అందలేదు.’ ఇలాంటి వారు ఇంకెందరున్నారో...

డ్రాప్ ఆట..!

- ఫీజు బకాయిల కోసం ఎత్తుగడలు
- టీసీలు ఇచ్చినా డ్రాప్‌బాక్స్‌లో కనిపించని పేర్లు
- వేరే పాఠశాలలో చేరేందుకు ఆటంకం
- యు–డైస్ ప్లస్‌లో నమోదుకు సాంకేతిక చిక్కులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు
- ఈ విద్యా సంవత్సరంలో తేలని అడ్మిషన్ల లెక్క



విద్యార్థినికి జారీ చేసిన టీసీ



విశాఖ విద్య: విద్యాహక్కు చట్టం మేరకు విద్యార్థి తనకు నచ్చిన స్కూల్లో చేరి, నిరభ్యంతరంగా చదువుకోవచ్చు. కానీ, కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ల నిర్వాహకులు ఫీజు బకాయిలు వసూళ్ల కోసం వారిని వేరే చోట చేరనివ్వకుండా ఆటంకాలు కలిగిస్తున్నారు. మీ ఇష్టం వచ్చిన స్కూల్‌కు వెళ్లిపోవచ్చని పైకి చెబుతున్నా, విద్యార్థుల పేర్లను డ్రాప్ బాక్స్‌లో ఉంచకపోవటంతో మరో స్కూల్లో వారి పేర్లు నమోదుకు సాంకేతికంగా ఇబ్బంది ఎదురవుతుంది. సాంకేతిక సమస్యతో ప్రభుత్వ స్కూళ్లలో కూడా యు–డైస్ ప్లస్‌లో విద్యార్థుల పేర్లు నమోదు సవ్యంగా సాగటం లేదు. దీంతో 2024–25 విద్యా సంవత్సరంలో ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారనే స్పష్టమైన లెక్క తేలడం లేదు.

డ్రాప్‌బాక్స్ అంటే..

ఒక పాఠశాల నుంచి మరొక పాఠశాలకు మారే సందర్భంలో ఆ స్కూల్ నిర్వాహకులు విద్యార్థి పేరును చైల్డ్ ఇన్ఫో నుంచి తొలగిస్తారు. దీంతో విద్యార్థి పేరు ఎడ్యుకేషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో గల డ్రాప్‌బాక్స్‌లోకి చేరుతుంది. వేరొక స్కూల్లో జాయిన్ అయిన తరువాత, అక్కడ మళ్లీ నమోదు చేయటానికి, ముందు చదివిన స్కూల్లో నిర్వాహకులు విద్యార్థి పేరును వారి పాఠశాల యు–డైస్ కోడ్ నుంచి తొలగించి, ఆ పేరును డ్రాప్‌బాక్స్‌లో ఉంచాలి. అలా అయితేనే డ్రాప్‌బాక్స్ నుంచి క్లియర్ అవుతుంది. కానీ కొన్ని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్ల నిర్వాహకులు ఈ విషయంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

సంక్షేమ పథకాలు దూరం..

యు–డైస్‌లో నమోదైన విద్యార్థికే గుర్తింపు ఉంటుంది. ప్రభుత్వ పరంగా అన్ని రకాల సంక్షేమ పథకాలు అందుతాయి. బడులు తెరిచి నెల రోజులు కావస్తున్నా చాలా స్కూళ్లలో విద్యార్థులు వివరాలు నమోదు నిర్లక్ష్యం తాండవిస్తోంది. విద్యార్థులంతా ఏదో ఒక పాఠశాలలో చదువుతున్నారని విద్యాశాఖాధికారులు చెబుతున్నా.. యు–డైస్ ప్లస్‌లో లేనందున వారికి హాజరు నమోదు కాదు. ఇలానే కొనసాగితే విద్యార్థులకు ప్రభుత్వ పరంగా సంక్షేమ పథకాలు అందించేటప్పుడు సాంకేతిక సమస్యలు ఎదురవుతాయి.

ఎంఈవోల పర్యవేక్షణ ఏదీ

డ్రాప్‌బాక్స్ సమస్యలపై తల్లిదండ్రుల నుంచి అందే ఫిర్యాదులపై సీరియస్‌గా స్పందించాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాలో డ్రాప్‌బాక్స్‌లో ఉన్న విద్యార్థులను గుర్తించి, డ్రాప్ బాక్స్ నుంచి వారిని క్లియర్ చేసేలా ఎంఈవో స్థాయిలో వెసులుబాటు ఉంది. కానీ ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాల ఒత్తిళ్లకు తలొగ్గుతున్న దిగువస్థాయి విద్యాశాఖాధికారులు ఇవేమీ పట్టించుకోవటం లేదని, అందువల్లనే తమ పిల్లల పేర్లను డ్రాప్‌బాక్స్‌లో కనిపించకుండా చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు.

విద్యాశాఖాధికారులు దృష్టి సారించాలి



విద్యార్థులు నచ్చిన స్కూల్లో చదువుకోవచ్చు. కానీ కొన్ని ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు ఫీజు వసూలు కోసమని టీసీలు సకాలంలో ఇవ్వటం లేదని మా దృష్టికి వచ్చింది. ఇలాంటి వాటిపై పరిశీలన చేస్తున్నాం. విద్యాశాఖాధికారులు సమస్యను పరిష్కరించేందుకు దృష్టి పెట్టాలి. ఇలాంటి వాటిపై బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ తీవ్రంగానే పరిగణిస్తోంది. – **డాక్టర్ జి.సీతారాం,** రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు

ఆటంకాలు కలిగిస్తే కఠిన చర్యలు



ఫీజుల కోసమని విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయకూడదు. అలాంటి యాజమాన్యాలపై కఠినంగానే వ్యవహరిస్తాం. ఈ ఏడాది అడ్మిషన్లపై ప్రత్యేక శ్రద్ధతీసుకుంటున్నాం. యు–డైస్ ప్లస్‌లో విద్యార్థుల పేర్లు నమోదుతోపాటు డ్రాప్ బాక్స్ ఉన్న వారి వివరాలను వెంటనే క్లియర్ చేయాలని జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల నిర్వాహకులకు ఆదేశించాం.

– బి.విజయభాస్కర్, ఆర్జేడీ

పోలీసుల అప్రమత్తత..

తల్లిదండ్రుల చెంతకు చిన్నారి


ప్రియను ఆమె తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్ఐ సూర్యకళ

అక్కిరెడ్డిపాలెం: తమ కుమార్తె కనిపించడం లేదని ఆమె తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుకు గాజువాక పోలీసులు వెంటనే స్పందించారు. సీసీ ఫుటేజీలను పరిశీలించి బాలికను గుర్తించారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఆమెను క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలివీ.. జీవీఎంసీ 68వ వార్డు మిందిలో ఆటో డ్రైవర్ గుర్రాల సత్యనారాయణ, అతని భార్య కుమారి, కుమార్తె ప్రియ నివసిస్తున్నారు. ప్రియ మిందిలోని ఎంపీపీ స్కూల్‌లో మూడవ తరగతి చదువుతోంది. చిన్నారి మంగళవారం పాఠశాల ముగిసిన వెంటనే ముగ్గురి పిల్లలతో ఆడుకుంది. తర్వాత అందులో ఒకరి వెంట వారి ఇంటికి వెళ్లిపోయింది. తమ పాప రాకపోవడంతో ప్రియ తల్లిదండ్రులు చుట్టు పక్కల వెతికారు. ఆచూకీ తెలియకపోవడంతో సాయంత్రం 6.30 గంటలకు గాజువాక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్ఐ సూర్యకళ వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. గ్రామంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. ఆ బాలిక పార్కులో తోటి పిల్లలతో ఆడుకుంటూ వారి వెనుక వెళ్లడం గుర్తించారు. ముగ్గురు బాలికలను గుర్తించి వారి వివరాలను సేకరించారు. వారిలో ఒకరి ఇంట్లో ప్రియ ఉండటాన్ని గుర్తించి అర్ధరాత్రి 12 గంటల సమయంలో బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. కాగా.. ప్రియ ఎవరింటికి వెళ్లిందో వారు ఇటీవల మిందికి వచ్చారు. వారికి ఈ ప్రాంతంపై అవగాహన లేదు. ప్రియ కూడా తన అడ్రస్ వారికి చెప్పలేకపోవడంతో.. రాత్రికి ఇంట్లోనే ఉంచి ఉదయం తమ కుమార్తెతో పాటు స్కూల్‌కు పంపిద్దామని ఆలోచన చేశారు. ఇంతలోనే పోలీసులు బాలికను గుర్తించారు. ఎస్ఐ సూర్యకళకు బాలిక తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కృషి


మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

ఉక్కునగరం : ఇచ్చిన హామీ మేరకు స్టీల్‌ప్లాంట్‌ను టీడీపీ కాపాడుతుందని ఎంపీ భరత్ అన్నారు. బుధవారం ఉక్కు హౌస్‌లో పోరాట కమిటీ నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసేలా తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ అంశంపై కొంత మంది తమ పార్టీపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఉక్కు యాజమాన్యంతో జరిగిన సమావేశంలో అన్ని విషయాలు చర్చించినట్లు తెలిపారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ యాజమాన్యంతో జరిగిన సమావేశం వివరాలను వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన గనుల లీజులు సత్వరం పునరుద్ధరించాలని కోరినట్లు, యాజమాన్యం విద్యుత్ బిల్లుల చెల్లింపుపై ఆదిగిన గడువు పెంపు అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టులకు విశాఖ ఉక్కు వినియోగించేలా చూడాలన్న అభ్యర్థనను ప్రభుత్వానికి విన్నవిస్తామన్నారు. 3 వేల కోట్ల రుణానికి సంబంధించి ఉక్కు మంత్రిత్వ శాఖ సిఫార్సుతో కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ నుంచి రావాల్సిన ఎల్‌వోసీ వచ్చేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, కె.ఎస్.ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు, యు.రామస్వామి, దొమ్మేటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మోకాలి మార్పిడిలో రోబోటిక్ విప్లవం!


మోకాలి మార్పిడికి రోబోటిక్ సర్జరీ చేస్తున్న వైద్యుడు

మహారాణిపేట: కాలంతోపాటే ఆలోచనా విధానమూ మారుతోంది. వైద్యరంగంలో ఆధునిక సాంకేతికత అందుబాటులోకి వస్తున్న తరుణంలో దానిని అందిపుచ్చుకునే వారి సంఖ్య కూడా పెరుగుతోంది. అలా వచ్చిందే మోకాలి మార్పిడి (నీ రీప్లేస్‌మెంట్)లో రోబోటిక్ సర్జరీ. ఇప్పటివరకు మోకాలి చిప్పలు అరిగిపోయిన వారు పీఆర్‌పీ ఇంజక్షన్లతో తాత్కాలిక ఉపశమనం పొందుతున్నారు. స్తోమత ఉన్న వారు సంప్రదాయ పద్ధతిలో శస్త్ర చికిత్సలు చేయించుకుంటున్నారు. ఇప్పుడు దానికి బదులు అత్యాధునిక రోబోటిక్ సర్జరీ విధానం అందుబాటులోకి వచ్చింది. ఈ విధానంలో ట్రాకర్ ద్వారా సమస్య ఎక్కడుందో నూరు శాతం గుర్తిస్తుంది. దీంతో వైద్యునికి స్పష్టత వచ్చి ఎముక, ఎక్కువ తక్కువలు కట్ చేయకుండా పరికరాన్ని అమర్చే వీలుంటుంది. దీనివల్ల 99 శాతానికి పైగా మోకాలి మార్పిడి సర్జరీలు విజయవంతమవుతున్నాయి. అంతేకాదు సర్జరీ జరిగిన మర్నాడే రోగిని నడిపిస్తారు. నెలలోపే రోగి సాధారణ స్థితికి చేరుకుంటాడు. అదే సంప్రదాయ పద్ధతిలో ఫిజియోథెరపీ 6–8 వారాలు చేయించుకోవలసి ఉంటుంది. రోబోటిక్ సర్జరీ తర్వాత నాలుగైదు వారాలు సరిపోతుంది. దీంతో నొప్పి నివారణకు మందులు వాడే అవసరం తప్పుతుంది. సంప్రదాయ విధానంలో మోకాలి మార్పిడికి రూ.2.60 లక్షల వరకు ఖర్చయితే రోబోటిక్ సర్జరీకి మరో రూ.40 వరకు వెచ్చించాల్సి ఉంటుంది. అయితే సర్జరీ అనంతరం ఫిజియోథెరపీకి వెచ్చించే సొమ్ము, మందుల వాడకం తగ్గడం, సర్జరీ నొప్పి రోజులు తగ్గడం రోగికి కలిసి వస్తుందని వైద్యులు చెబుతున్నారు.

భవిష్యత్ రోబోటిక్‌దే



వైద్యరంగంలో భవిష్యత్తు అంతా రోబోటిక్‌దే. ఈ టెక్నాలజీ వల్ల మోకీలు మార్పిడిపై భవిష్యత్తులో ఎవరూ భయపడే పరిస్థితి ఉండదు. ప్రస్తుతానికి రోబోటిక్ టెక్నాలజీ మెషినరీకి పెట్టుబడి రూ.కోట్లలో ఉంది. ముమ్ముందు మరిన్ని ఆస్పత్రులు వీటిని ఏర్పాటు చేసుకుంటాయి. దీంతో రోబోటిక్ సర్జరీ వ్యయం తగ్గుతుంది. దేశంలో తొలిసారిగా 2022లో కోయంబత్తూరు ఆస్పత్రిలో రోబోటిక్ సర్జరీ మెషినరీ ఏర్పాటైంది. విశాఖలో ఏర్పాటు చేసినది ఆంధ్రలో రెండోది. ఒక్కసారి రోబోటిక్ సర్జరీ జరిగితే రెండోసారి చేయించుకునే అవసరం రాదు. 60 ఏళ్ల పైబడ్డ వారికి మోకాలు మార్పిడి సర్జరీ అవసరం ఏర్పడుతోంది. ఈ సర్జరీ 80 ఏళ్ల వాళ్లూ మళ్లీ మామూలుగా తిరగ గలుగుతారు. గతంకంటే మనిషి సగటు జీవితకాలం పెరగడం వల్ల నీ–రీప్లేస్‌మెంట్ చేయించుకునే వారి సంఖ్య తప్ప కేసుల సంఖ్య పెరగడం లేదు. – **డాక్టర్ వి.రవిచంద్ర,** రోబోటిక్ సర్జన్, విశాఖ

ప్రశాంతి షోరూమ్‌లో చీరలకు విశేష స్పందన



మాట్లాడుతున్న షోరూమ్ ప్రతినిధి

మహారాణిపేట: డాబాగార్డెన్స్‌లోని ప్రశాంతి షోరూమ్‌లో చీరల అమ్మకాలకు విశేష స్పందన లభిస్తోంది. దేశంలో ప్రఖ్యాతి గాంచిన ప్రశాంతి అయిదో షోరూమ్‌ను ఇటీవల విశాఖలో ప్రారంభించారు. ఎన్నో రకాల వెరైటీ చీరలను తక్కువ ధరలకు విక్రయించడంలో ప్రశాంతికి మంచి పేరు ఉంది. దీంతో మహిళలు తండోపతండాలుగా వచ్చి ఇక్కడ చీరలు కొనుగోలు చేస్తున్నారు. మహిళలకు నచ్చే 100 రకాల డిజైన్లలో చీరలు సిద్ధంగా ఉంచామని, విశాఖ ప్రజలు ఎంతో ఆదరిస్తున్నారని షోరూమ్ ప్రతినిధులు ప్రకటించారు. డాబాగార్డెన్స్‌లో అయిదంతస్తుల భవనంలో షోరూమ్ ప్రారంభించామని, రెండు అంతస్తుల్లో ప్రఖ్యాతి గాంచిన పలు కంపెనీలకు చెందిన ప్యూర్ సిల్క్ చీరలు అందుబాటులో ఉంచామన్నారు. ఇక్కడ రూ.6 వేల నుంచి రూ.2.50 లక్షల విలువ చేసే చీరలు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

ఉపాధి కార్యాలయంలో రేపు జాబ్‌మేళా

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈ నెల 12న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు కె.శాంతి తెలిపారు. జాబ్ డీలర్స్, మెడ్‌ప్లస్, హెటిరో డ్రగ్స్, హీరో మోటోకార్ప్, ముత్తూట్ గ్రూప్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల్లో 315 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. ఆడిట్ అసిస్టెంట్, వేర్‌హౌస్ హెల్పర్స్, జూనియర్ కెమిస్ట్, ట్రైనీ, వెల్డర్స్, ప్యాకింగ్ అసిస్టెంట్, స్కానింగ్ అసిస్టెంట్, రిసెప్షనిస్ట్ ఆఫీసర్, సీనియర్ రిలేషన్‌షిప్ ఆఫీసర్, క్లర్క్స్, ఆఫీసర్స్, సీనియర్ ఆఫీసర్స్, అసిస్టెంట్ మేనేజర్, సేల్స్ అండ్ ఆపరేషన్స్, ట్రైనీ అసిస్టెంట్ అండ్ ఫార్మాసిస్ట్, టెలీ అకౌంట్స్ అసిస్టెంట్ అప్రెంటిస్, ఫీల్డ్ ఆఫీసర్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులు. 18–35 ఏళ్ల వయసు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు హాజరుకావచ్చు. ఆయా ఉద్యోగాలను బట్టి నెలకు రూ.15,000 నుంచి రూ.25,500 వరకు జీతం ఉంటుంది. అర్హత, ఆసక్తి ఉన్న వారు ఆ రోజు 10 గంటల నుంచి జరిగే జాబ్‌మేళాకు హాజరుకావాలని ఆమె కోరారు.

నేడు జేఎల్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

కంచరపాలెం: విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాల్లో ఫిజిక్స్, జువాలజీ, కెమిస్ట్రీ, పీజీటీ, సోషల్, టీజీటీ–ఫిజికల్ సైన్సు(ఫిజిక్స్), సోషల్, ఇంగ్లిష్, హిందీ సబ్జెక్టులను బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీలను నియమిస్తున్నారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు గురువారం ఉదయం 10 గంటల నుంచి మేహాద్రిగెడ్డ(ఆర్ఆర్‌పురం)లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చు. సంబంధిత సబ్జెక్టు(పీజీ)లో 55 శాతం మార్కులు, బీఈడీ, టెట్ అర్హత కలిగి ఉండాలని, సంబంధిత ధ్రువీకరణపత్రాల ఒరిజినల్స్, ఒక సెట్ జిరాక్స్ పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా సమన్వయాధికారి ఎస్.రూపవతి ఓ ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ 0891–2799641ను సంప్రదించవచ్చు.

గరీబ్‌రథ్‌కు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికులకు మరింత సుఖవంతమైన, సౌకర్యవంతమైన, వేగవంతమైన ప్రయాణాన్ని అందించే దిశగా వాల్తేర్ డివిజన్ కృషి చేస్తుంది. దీనిలో భాగంగా పలు రైళ్లకు పాత కోచ్‌ల స్థానంలో అధిక సీటింగ్, అదనపు వసతులతో కూడిన ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను ఏర్పాటు చేస్తుంది. వాల్తేర్ డివిజన్ పరిధిలో ఇప్పటికే చాలా రైళ్లు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో నడుస్తున్నాయి. అంచెలంచెలుగా మిగిలిన రైళ్లకు కూడా ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను ఏర్పాటుచేయనుంది. అందులోభాగంగా ఈ నెల 22వ తేదీ నుంచి సికింద్రాబాద్–విశాఖపట్నం(12740) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 23వ తేదీ నుంచి విశాఖపట్నం–సికింద్రాబాద్(12739) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌లు పూర్తిగా ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో నడవనున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు.

నేటి నుంచి పాలిసెట్ ఆఖరు దశ కౌన్సెలింగ్

మురళీనగర్: పాలిటెక్ ప్రవేశాలకు సంబంధించి ఆఖరి విడత కౌన్సెలింగ్ గురువారం నుంచి ఈనెల 13వ తేదీ వరకు నిర్వహిస్తామని పాలిసెట్ విశాఖ జిల్లా కన్వీనరు డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. మొదటి విడతలో రిజిస్ట్రేషన్ చేసుకోలేని వారు ఈ సారి రిజిస్ట్రేషన్ చేసుకొని సర్టిఫికెట్ల పరిశీలన చేసుకోవచ్చని చెప్పారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో కంచరపాలెం పాలిటెక్నిక్‌లో మాత్రమే కౌన్సెలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. రిజిస్ట్రేషన్‌తోపాటు సర్టిఫికెట్ల పరిశీలన, ఆప్షన్ల ఎంపిక గురువారం నుంచి 13వ తేదీ వరకు చేసుకోవచ్చు. ఈనెల 14న ఆప్షన్ల మార్పిడి, 16వ తేదీన సీట్ల కేటాయింపు జరుగుతుంది. 18 నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ జాయినింగ్ రిపోర్టింగు చేసి సంబంధిత కాలేజీలకు రిపోర్టు ఇవ్వాల్సి ఉంటుంది.

విశాఖ - విజయనగరం ప్రయాణికులపై టోల్ భారం


రాజాపులోవ-రాయ్‌పూర్ రహదారిపై బోడమెట్టపాలెం వద్ద ఏర్పాటు చేసిన టోల్ ప్లాజా

తగరపువలస: భీమిలి శివారులో ప్రారంభమయ్యే రాజాపులోవ – రాయ్‌పూర్ జాతీయ రహదారి (పాతది 43, కొత్తది 26)పై బోడమెట్టపాలెం వద్ద పది రోజుల క్రితం ప్రారంభించిన టోల్‌గేట్ ప్రయాణికులకు భారంగా మారింది. వాస్తవానికి ఈ టోల్‌గేట్ విజయనగరం – రాయ్‌పూర్ పట్టణాల మధ్య కొత్త జాతీయ రహదారికి సంబంధించినది. భీమిలి మండలం బోడమెట్టపాలెంను ఆనుకుని విజయనగరం జిల్లా జొన్నాడ పేరుతో టోల్ తీస్తున్న దీనిని ఇరు పట్టణాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. విశాఖ నుంచి విజయనగరం వెళ్లినా, రాయ్‌పూర్ వెళ్లినా ఇక్కడ టోల్‌ఫీజు వసూలు చేస్తున్నారు. కానీ విజయనగరం నుంచి బయలుదేరి రాయ్‌పూర్ వెళ్లేవారికి ఈ టోల్ గేట్ బెడద ఉండదు. ఇది జాతీయ రహదారుల సంస్థకు చెందినది కాబట్టి విజయనగరం – రాయ్‌పూర్ మార్గంలోనే ఉండాలంటున్నారు. కానీ భీమిలి మండలానికి ఆనుకుని నిర్మించడం వల్ల విశాఖ – విజయనగరం ప్రయాణికులపై కొత్త భారం పడింది. ఇటీవల ఆనందపురం – అనకాపల్లి మార్గంలో దుక్కవానిపాలెం వద్ద ఏర్పాటు చేసిన టోల్‌ప్లాజా నుంచి స్థానికులకు మినహాయింపు ఇస్తూ సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేశారు. బోడమెట్టపాలెం వద్ద మాత్రం మినహాయింపు ఇవ్వకుండా కారుకు రూ.60, వ్యాన్‌కు రూ.95, బస్సుకు రూ.195, ఇతర పెద్ద వాహనాలకు రూ.215 నుంచి రూ.370 వరకు ఒకవైపు వసూలు చేస్తున్నారు. టోల్‌గేట్‌కు అటు, ఇటువైపు కేవలం 2 కిలోమీటర్ల పరిధిలోనే ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలలున్నాయి. దీంతో కార్లపై వచ్చేవారికి, తగరపువలస, విశాఖ నుంచి వివిధ పనుల మీద విజయనగరం వచ్చేవారికి భారంగా మారడంతో వ్యతిరేకిస్తున్నారు. ప్రజాసంఘాలు, ప్రభుత్వాల ప్రతినిధులు జోక్యం చేసుకుని ఈ టోల్‌గేట్‌ను తగరపువలస – విజయనగరం మధ్యలో కాకుండా విజయనగరం – రాయ్‌పూర్ మార్గంలోకి మార్చాలని సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తున్నారు.